సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం గ్రామపంచాయతీ కర్లపొదోర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ సిసి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్రా.త్రినాధ్ మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రకు సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని గత రెండేళ్లుగా వినత పత్రాలు సమర్పించడంతో బిర్రిగుడ, ఆర్లాయిపుట్, ఉబ్బెంగుళ గ్రామాలతో పాటు కర్లపొదోర్‌లో సీసీ రోడ్డు నిర్మాణలకు నిధులు కేటాయించారన్నారు. కర్లపొదోర్ గ్రామస్తుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సాధురం, జగబంధు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శకటాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అదేవిధంగా ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసులను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముందు , తరువాత మైదాన్ని పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేయాలని ట్రాన్స్కో అధికారులకు సూచించారు.ఈ సమావేశం లో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ. కె. పద్మలత, డి.ఆర్.డి.ఏ. పి.డి. వి.మురళి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎన్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, పశు సంవర్ధక శాఖ డి.డి. నరసింహులు, జిల్లా సెరీ కల్చర్ అధికారి అప్పారావు, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ జి. డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు

పాడేరు: ముంచంగిపుట్టు మండలం సుజనకోట గ్రామం వద్ద మాచ్ ఖండ్ బ్యాక్ వాటర్ వద్ద పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం పర్యాటక అభివృద్ధి, చలి అరకు ఉత్సవం 25 పై కలెక్టరేట్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బుధవారం సుజన కోట పంచాయతీలో పర్యటించానని మాచ్ ఖండ్ రిజర్వాయర్ కేజ్ కల్చర్, ప్యారా సైలింగ్, పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా ఉందన్నారు. రిజర్వాయరు పరివాహక ప్రాంతంలో 350 మంది వరకు మత్స్యకారులు ఉన్నారన్నారు. మత్స్యకారులతో సొసైటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కేజ్ కల్చర్ ఏర్పాటుకు బ్యాంకుల నుండి రుణాలు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.5 లక్షల పెట్టుబడితో కేజ్ కల్చర్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేజ్ కల్చర్ ఉపయోగంగా ఉంటుందని అన్నారు.గిరిజన ఆచార సాంప్రదాయాలు ప్రతిబింబించేలా చలి అరకు ఉత్సవం నిర్వహించాలని చెప్పారు. అరకు పట్టణంలో విద్యుత్తు దీపాలు అన్ని వెలిగే విధంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఏ, పి.ఓ. వి.అభిషేక్ సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, మ్యూజియం మేనేజర్ మురళి, పర్యాటక శాఖ అధికారులు ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ ఆర్ నిబంధనల ప్రకారం ప్యాకేజీ అమలు

రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సింహాచలం, చిత్రంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-దేవీపట్నం

పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ నిబంధనలు ప్రకారం ప్యాకేజి అమలు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక మండల తహశీల్దారు కార్యాలయంలో పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలపై గురువారం బాధితులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పిఒ సింహాచలం మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులైన గిరిజనులకు వ్యవసాయానికి అనుగుణంగా భూమికి భూమి ఏర్పాటు చేయడానికి, భూములు కోల్పోయిన ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులను పూర్తిస్థాయిలో పరిశీలించి బాధితుల అర్హతను బట్టి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు సుబ్బారావు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

సభకు హాజరైన నిర్వాసితులు

పరామర్శిస్తున్న ఎటిడబ్ల్యూఓ మల్లికార్జున రావు

నిలకడగా విద్యార్థిని ఆరోగ్యం

ప్రజాశక్తి-అరకులోయ: మండలంలోని కొత్త బల్లు గూడ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సోడాపల్లి రత్న ఆరోగ్యం నిలకడగా ఉందని అరకులోయ ఏటిడబ్ల్యూవో మల్లికార్జునరావు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ అరకులో య ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోడాపల్లి రత్నను ఆయన గురువారం పరామర్శించారు. విద్యార్థిని ఆరోగ్యంపై మేట్రిన్ మోహినిను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని వైద్యులను సంప్రదించి చికిత్స అందుతున్న తీరు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినికి టైఫాయిడ్ జ్వరం ఉందని కే జి హెచ్ కు తరలించాలని వైద్యులు సూచించినప్పటికీ తల్లిదండ్రులు అందుకు సహకరించలేదని ఆయన అన్నారు. తల్లితండ్రులు తమకు సంపూర్ణంగా సహకరిస్తే మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని ఎ టి డబ్ల్యూవో మల్లికార్జున స్పష్టం చేశారు.

సంక్రాంతి సెలవులతో విద్యార్థులు ఇంటి బాట

ప్రజాశక్తి-పాడేరుటౌన్: విద్యాలయాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు. ఈ ఏడాది జనవరి 10 నుంచి 19 తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో గురువారం తమ పిల్లలను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకు వెళ్లిపోతున్న దృశ్యాలే దర్శనమిచ్చాయి. పిల్లల లగేజీలు పట్టుకొని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు, పాత బస్ స్టాండ్ కు వెళుతున్న వారితో గురువారం పాడేరులో హడావిడి వాతావరణం కనిపించింది.

ఆటోలో వెళుతున్న విద్యార్థులు

తల్లిదండ్రులతో ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు

మహిళా చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

ఐద్వా ఆధ్వర్యాన వివిధ రకాల పోటీలు

ప్రజాశక్తి-చింతూరు

మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, గృహహింస పెరిగిపోతున్నాయని, చట్టాలు ఉన్నా అమలు శూన్యంగా ఉందని, చట్టాలను పటిష్టంగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లం సుబ్బమ్మ, ముర్రం రంగమ్మ డిమాండ్ చేశారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో ఐద్వా ఆధ్వర్యాన గురువారం మహిళలకు తాడాట, కుర్చీ ఆట, బంతి ఆట, రంగవల్లిలు పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రథమ, ద్వితీయ, ఉత్తమ ప్రదర్శన బహుమతులను అందించారు. అనంతరం జరిగిన మహిళా సదస్సులో ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లం సుబ్బమ్మ, ముర్రం రంగమ్మ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు ఆగడం లేదన్నారు. ఆరు నెలల పసికందు నుండి 90 ఏళ్ల ముసలివారు వరకు నిత్యం ఏదో ఒక ప్రదేశంలో అఘాయిత్యాలకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన సందర్భంలో పాలకులు అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారని, నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మహిళలపై హింస తగ్గాలంటే మద్యం, డ్రగ్స్, అశ్లీలతను నియంత్రించాలని కోరారు. మహిళలపై జరిగే దారుణాలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు ప్రతి నెల రూ.1500 ఇవ్వాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ప్రతి మహిళకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ జయలక్ష్మి, యు నాగమణి, మాధవి, వరలక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

సబ్సిడీపై సరుకులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే తెల్ల రేషన్ కార్డ్ లబ్ధిదారులకు సబ్సిడీపై సరుకులు పంపిణీ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ప్రకటనలు అమలు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం నేత సొలగం దాశరం దొర గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో కొత్తసుజానకోట గ్రామంలో సుమారు 100 కు పైబడి తెల్ల రేషన్ కార్డు దారులు కలిగి ఉన్నప్పటికీ సబ్సిడీపై కందిపప్పు, పంచదార, బటాని, తదితర వంట సరుకులు ఇవ్వలేదన్నారు. కిలో కందిపప్పు పప్పు ఇవ్వవలసి అండగా, జనవరి నెలలో అర్థ కేజీ చొప్పున కొద్దీమందికి మాత్రమే సబ్సిడీపై విక్రయించారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులకు పప్పు, నూనె, పంచదార, బెల్లం, కారం వంటి సరుకులు సబ్సిడీపై విక్రయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

డ్రైవర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ పరిధి మర్దగుడ గ్రామానికి చెందిన కొర్రా. నాగేంద్ర అనారోగ్యంతో బాధ పడుతున్నందున బొర్రా మోటార్ ఫీల్డ్ యూనియన్ సభ్యులు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్య కారణంగా మంచాన పడ్డ డ్రైవర్ నాగేంద్రకు యూనియన్ సభ్యులు చేతులు కలిపి 11000 రూపాయల ఆర్థిక సహాయాన్ని సిఐటియు మండల కార్యదర్శి కిలో .మొస్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దేవన్న, స్థానిక సర్పంచ్ కె.సింహాద్రి పాల్గొన్నారు.

నగదు ఇస్తున్న యూనియన్ నేతలు

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

హక్కులు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రతి ఒక్కరు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, . సంక్రాంతి సంబరాల దృష్ట్యా కోడి పందేలు జూదాలు వంటి కార్యకలాపాలు చేపట్ట కూడదని స్థానిక ఎస్సై. శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఎస్ ఆర్ పురం పంచాయితీ దిగువ కోటపర్తి చుట్టు ప్రక్కల గ్రామాల్లో సర్పంచ్ బి.సన్నమ్మ, మాజీ ఎంపిటిసి రామయ్య, రవి ఆధ్వర్యంలో గిరిజనులకు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. సంక్రాంతి సంబరాలు దృష్ట్యా ఎటువంటి ఘర్షనలకు పాల్పడవద్దని సూచించారు

మెడికల్ కళాశాలలో పోస్టుల సంఖ్యను పెంచాలి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: పాడేరు మెడికల్ కళాశాలలో ప్రకటించిన పోస్టులను పెంచి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కాకుండా పర్మినెంట్ పోస్టులుగా భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రామారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పేరుతో గిరిజన యువతను శ్రమ దోపిడి చేయడానికి ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని తెలిపారు.శాశ్వత ప్రాతిపదికన మెడికల్ కళాశాలలో ఉన్న 244 పోస్టులతో కలిపి అదనంగా భర్తీ చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ పేరుతో యువత జీవితాలతో ఆడుకోవద్దన్నారు.రాత పరీక్షల ద్వారా ఉపాధి అవకాశాలు శాశ్వత ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు.ఈ పోస్టులు భర్తీ విషయంలో రాజకీయ జోక్యం ఉండరాదని అన్నారు.

'అరకు ఉత్సవాలు ఎవరి కోసం'

ప్రజాశక్తి-అరకులోయ: ఈ నెలాఖారున ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన అరకు ఉత్సవ్ ఎవరి కోసమని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. అరకు లోయలో వారు విలేకరులతో మాట్లాడుతూ, యువతకు ఉద్యోగాలు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, అభివృద్ధిని గాలికి వదిలేసి అరకు ఉత్సవ్ నిర్వహించడం తగదని అరకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాచిపెంట చిన్నస్వామి అన్నారు.గిరిజనులకు ఏమీ అభివృద్ధి సాధించారని ఆయన ప్రశ్నించారు. అరకు ఉత్సవాలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఐటీడీఏ పరిధిలో సుమారు 64 శాఖల్లో వేలాదిగా వివిధ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ కాంగ్రెస్ కోఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరరావు, అరకు వేలి మండల కాంగ్రెస్ పార్టీ కిషన్ సెల్ మండల అధ్యక్షుడు పూజారి దామోదర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కొర్ర గోవింద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా

కాఫీ ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-సీలేరు

గిరిజనులు పండించిన కాఫీ ఉత్పత్తులను అంతర్జాతీయ కాఫీ రేట్లుకు అనుగుణంగా ప్రభుత్వం కొనుగోలు చేయాలని జికె.వీధి గ్రామ పీసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగేశ్వరరావు ఎం.గిరి డిమాండ్ చేశారు. గురువారం జరిగిన పీసా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ అంతర్జాతీయ కాఫీ బోర్డు సంస్థ పార్చ్మెంట్ కాఫీ కిలో ధర రూ.452, చెర్రీ కిలో రూ.260గా ప్రకటించిందని, కాని జిసిసి పార్చ్మెంట్ కిలో రూ.320కు, రూ.చెర్రీ కిలో రూ.170కు కొనుగోలు చేస్తుందని చెప్పారు. పాడేరు ఐటీడీఏ మ్యాక్స్ సంస్థ ద్వారా కాఫీ పండ్లు కేజీ కేవలం రూ.44కే కొనుగోలు చేయగా, దళారీలు రూ.50 నుంచి రూ.55కు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల గిరిజన రైతులు తీవ్ర నష్టాలు చవి చూడాల్సి వస్తోందన్నారు. ఐటీడీఏ, జిసిసి అంతర్జాతీయ కాఫీ రేట్లకే గిరిజనుల దగ్గర కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దళారీలు తమకు నచ్చిన రేట్లు ప్రకటించి గిరిజన రైతులను మోసగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా కాలంగా దళారీలు ముందస్తుగా కాఫీ పంటలకు గిరిజనులకు పెట్టుబడులు పెట్టి అతి తక్కువ రేటుకు కాఫీ పండ్లు కొనుగోలు చేసి సోము చేసుకుంటున్నారని చెప్పారు. దళారీ వ్యవస్థని పూర్తిగా నిర్మూలించే విధంగా జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఓ, అధికారులు చర్యలు తీసుకొని గిరిజన రైతుల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంపరంగి బుజ్జిబాబు, నాగేశ్వరరావు, ముక్కల గిరి, జగత్‌రావు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జికె.వీధి పీసా కమిటీ నాయకులు

అంగన్వాడీ కేంద్రాల్లో

న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి-చింతూరు : ప్రతి అంగన్వాడీ కేంద్రంలో న్యూట్రీ గార్డెన్‌లు ఏర్పాటు చేయాలని మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయ దేవి అన్నారు. చింతూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి చట్టి సెక్టార్‌లో ఉన్న చట్టి-2 అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలను పర్యవేక్షించారు. అన్నీ కేంద్రాల్లో ఈ సదుపాయాలు ఉండేవిధంగా చూడాలని సంబంధిత అధికారులతో చర్చించి వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రీస్కూల్ పిల్లలతో ముచ్చటించి ఆటపాటలను వీక్షించారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, రిజిస్టర్ వర్క్, ప్రీస్కూల్ పిల్లల హాజరు, మెనూ, గ్రోత్ మానిటరింగ్‌కి సంబందించి పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎత్తు తూకం, పెరుగుదల పర్యవేక్షణను కార్యకర్తలు శ్రద్ధతో చేయాలని, కరెక్టుగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. సివిల్ సప్లై నుండి అందుతున్న స్టాక్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి పి.విజయగౌరి, సెక్టార్ పర్యవేక్షణ అధికారులు కుమారి, డి.దుర్గా ప్రియాంక, పి.సంఘమిత్ర ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చిన్మయదేవి

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

అగ్నివీర వాయుసేన ఉద్యోగాలకు ఏజెన్సీలోని గిరిజన యువతీ యువకుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 జనవరి 1 నుండి 2008 జులై 1 మధ్య జన్మించి, అవివాహిత పురుష, స్త్రీ అభ్యర్థులు మాత్రమే దీనికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వారికి ఆన్‌లైన్ పరీక్ష ఈ ఏడాది మార్చి 22 నిర్వహిస్తామని తెలిపారు. apnipathvayu.cdac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని పలు అభివృద్ధి పనులను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విజయభాస్కర్ శుక్రవారం ప్రారంభించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వట్టిగెడ్డ గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన జనుమూరి రమణమ్మ గోశాలను, లోదొడ్డి నుంచి కిండంగి రోడ్డును ప్రారంభిస్తారని, కిమిలిగడ్డ నుంచి ముర్లవాని వీధి వరకు తారురోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, టిడిపి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పెద్దిరాజు కోరారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

పెదబయలు సెంటాన్స్ పాఠశాలలో...

ప్రజాశక్తి-జి మాడుగుల: మండల కేంద్రంలో బీవీకే పాఠశాలలో సంక్రాంతి పండగ ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి సెలవులు ముందు ముందుగానే పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించుకుంటారు. భోగి మంటలు వేశారు సంక్రాంతి ముగ్గులతో పాఠశాల ఆవరణ సుందరవనంగా చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్‌రావు, టీచర్స్ సుదర్శన, కమలకుమారి, నాగజ్యోతి, వాణి, హనీషా, ప్రమీల విద్యార్థులు పాల్గొన్నారు.

పెదబయలు :స్థానిక సెంటెన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రైతులతో సంక్రాంతి సంబరాలు గురువారం నిర్వహించారు. రైతులను సన్మానించి ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు మాట్లాడుతూ,అన్నం పెట్టే రైతన్నలను ఆదుకోవడం మన బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ నిర్మల, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ స్టాజీ పాల్గొన్నారు.

చింతపల్లి : పర్యాటక ప్రాంతంగా పేరొందిన ఆంధ్ర కశ్మీర్ లంబసింగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ఎస్.ఎన్ రాజు, వసతి గృహ అధికారిని ఎన్ కవిత నాయుడుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంక్రాంతి సంబరాలలో రంగవల్లులతో పాటు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. చిన్నారులు వేసిన హరిదాసు తదితర వేషధారణలు ఆహుతులను విశేషంగా ఆకర్షించాయి.

సంతలో సంక్రాంతి సందడి

పాడేరు టౌన్: మన్యంలోని వారపు సంతల్లో సంక్రాంతి సందడి మొదలైంది. గిరిజన ప్రాంత మారుమూల గ్రామాల ప్రజలకు వారపు సంతలే సూపర్ మార్కెట్ లు. మన్యంలోని సంతలే గిరిజనులకు సమస్తం. వారి జీవన ప్రయాణంలో ఇవి ఓ భాగం. ఇది తరతరాలుగా కొనసాగుతున్న ఆచారం. అందులోనూ పండుగల్లో సంతకు పోవాలంటే వారిలో వచ్చే ఉత్సాహం అనంతం. సంక్రాంతి సమీపిస్తుండడంతో పండుగకు అవసరమైన సరుకుల కోసం ఇంటిల్లిపాది తరలి పోతున్నారు.దీంతో, సంతలు కళకళలాడుతున్నాయి. నిత్యావసర సరుకులతో పాటు పండుగ వస్తువులను కూడా ఇక్కడే కొనుగోలు చేస్తారు. సంక్రాంతి పండుగ సమీపించడంతో గురువారం పాడేరు మండలంలోని గుత్తులపుట్టులో జరిగిన వారపు సంత వినియోగదారులతో కిక్కిరిసిపోయింది. నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు, పూజా సామాగ్రి, నాటు కోళ్ళు, మేకపోతులను కొనుగోలు చేసేందుకు పాడేరు, పెద్దబయలు, హుకుంపేట మండలాలకు చెందిన వివిధ పంచాయతీల నుంచి ప్రజలు రావడంతో సంత రద్దీగా మారింది. సంక్రాంతికి అవసరమయ్యే కుండలు, స్టీల్ పాత్రలు, బట్టలు చెప్పులు తదితర వస్తువులను గిరిజన ప్రజలు కొనుగోలు చేశారు.

లంబసింగి ఆశ్రమ పాఠశాలలో...

సీలేరు డిఎవి పాఠశాలలో...

సీలేరు:జీకే.వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. డిఎవి పాఠశాలలో హెచ్ఎం కిరణ్ కుమార్, డి.వి.కాశీశ్వరరావు సంక్రాంతి విశిష్టతను వివరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో వివిధ రంగులతో విద్యార్థులు రంగవల్లులను తీర్చిదిద్దారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోగి మంటలు వేసి విద్యార్థులు ఉపాధ్యాయులు ఆటా పాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు బాల నరేష్, మూర్తి, కమలాకర్, ఓం నమ:శివాయ, వెంకటరత్నం, అప్పలరాజు, దామోదర్, వెంకటరమణ, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మరుగుదొడ్లకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-పాడేరు:స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో సామాజిక మరుగు దొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి గ్రామీణ నీటి సరఫరా విభాగం, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారులు ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,వారపు సంతలు, పర్యాటక ప్రాంతాలలో నీటి సదుపాయం ఉన్న గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్లు నిర్మిస్తామని చెప్పారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదించాలని చెప్పారు.సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సక్రమంగా జరగాలన్నారు.కేరళ వారందరికి వ్యక్తిగత ఇంకుడు గుంతలు మంజూరు చేస్తామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మిస్తామని పేర్కొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు అర్జునరావు మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తున్నామన్నారు. వాటి నిర్మాణానికి రూ.12 వేల నిధులు మంజూరు చేస్తున్నామని. రూ.3 లక్షల వ్యయంతో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో నిర్మించిన గృహాలకు 27834 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేసామన్నారు. జిల్లాలో 22 వేల ఇంకుడు గుంతలు నిర్మాణానికి ప్రతిపాదించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటిడిఎ పిఒలు వి.అభిషేక్, అపూర్వ భరత్, కె. సింహాచలం పంచాయతీ అధికారి బి.లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్.కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, హౌసింగ్ పిడి బి.బాబు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి నేపథ్యంలో విశాఖపట్నం నుండి వివిధ ప్రాంతాలకు రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను ఐదు రోజులు పాటు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు ప్రతి రోజూ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం నుండి హైదరాబాద్‌కు 20 బస్సులు, రాజమండ్రి, విజయవాడకు 40 బస్సులు, కాకినాడకు 20, విజయనగరం, పాలకొండ,పార్వతీపురం, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాలకు 830 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సులు ఏర్పాటుతో పాటు, అధికారులు, సూపర్‌వైజర్లు 24 గంటలు స్టేషన్‌లో ఉండి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

వందే భారత్ రైళ్లకు కోచ్‌ల పెంపు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా విశాఖపట్నం - సికింద్రాబాద్ - విశాఖపట్నం మధ్య నడిచే వందే భారత రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన నాలుగు అదనపు కోచ్‌లను ఈ నెల 11 నుంచి ఏర్పాటుచేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో 20833 విశాఖపట్నం - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్ ప్రెస్, 20834 సికింద్రాబాద్ - విశాఖపట్నం వందేభారత్‌కు నూతన కోచ్‌లను ఏర్పాటుచేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ కమర్షియల్ డివిజనల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. దీంతో ఈ వందేభారత్ రైళ్లు రెండు ఎగ్జిక్యూటివ్ చైర్ కార్, 18 చైర్ కార్ కలుపుకొని మొత్తం 20 కోచ్‌లతో ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందజేశారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైన మురళీనగర్‌కు చెందినా వాసుదేవ్ ప్రజాపతి, అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన పోలిశెట్టి వెంకట నాగ మాధవి, మద్రిపాలేనికి చెందిన కోన శంకరరావు లకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పోలీస్ కమిషనర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మూవ్మెంట్ 21 పిలుపు మేరకు ఆంధ్ర యూనివర్సిటీలో భారతదేశ తొలి ముస్లిం అధ్యాపకులు ఫాతిమా షేక్ జయంతిని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఫాతిమా షేక్ చిత్రపటానికి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ మాజీ అధ్యక్షులు డాక్టర్ బెన్నీ పూలమాల వేశారు.

మాట్లాడుతున్న డిటి షేక్ ముజీబ్

భూ సమస్యలపై రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: భూ సమస్యలు పరిష్కారం చేయడం కోసమే ప్రభుత్వం ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని మండల డిప్యూటీ తహసిల్దార్ షేక్ ముజీబ్ చెప్పారు. మండల కేంద్రంలోని సామాజిక భవనంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ భూ సమస్యలపై అధికారులకు దరఖాస్తులను చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొండపోడు పట్టాలు, సాగు భూమి పట్టాల మార్పిడితో పాటు ఆన్లైన్లో జరిగిన పలు సమస్యలపై అనేకమంది గిరిజనులు భూ సమస్యలపై ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటువంటి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ సదస్సులను నిర్వహిస్తుందని, వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ చిరంజీవి, వీఆర్వో సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు మాజీ జెడ్ పి టి సి ఎం శ్రీరాములు, స్వామి పాల్గొన్నారు.

18న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన ఈ నెల 18న జరగనుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి గురువారం తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటల నుంచి సమావేశ మందిరంలె కొనసాగుతుందని, సభ్యులు,అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు.

తిరుమల తొక్కిసలాట ఘటనతో... విశాఖ, నర్సీపట్నంలో విషాదఛాయలు

భర్త, కుమారునితో శాంతి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-యంత్రాంగం

తిరుమల తిరుపతి దేవస్థానం వైకుంఠ ఏకాదశి టోకెన్ల పంపిణీలో బుధవారం జరిగిన తొక్కిసలాటలో విశాఖ నగరానికి చెందిన ముగ్గురు మహిళలు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పెద్దబొడ్డేపల్లికి చెందిన ఒక వ్యక్తి మృతిచెందడంతో ఆయా ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డు పరిధి కంచరపాలెం ఇందిరానగర్-5కు చెందిన సుమారు 15 మంది వైకుంఠ ద్వార దర్శనానికి వెళ్లారు. బుధవారం జరిగిన తొక్కిసలాటలో ఈ ప్రాంతానికి చెందిన కండిపల్లి శాంతి (35) మృతిచెందారు. ఆమె భర్త వెంకటేష్ కంచరపాలెం మెట్ట వద్ద ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో వీరంతా తిరుపతి వెళ్లారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద వచ్చిన బంధుమిత్రులతో ఆమె విడిపోయి జనంలో చిక్కిపోయారని, ఒక్కసారిగా జరిగిన తొక్కిసలాటలో ఆమె మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని కాలనీవాసులు చెబుతున్నారు. శాంతి ఎప్పుడూ నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ ఉండేదని గుర్తుతెచ్చుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

జివిఎంసి 43వ వార్డు పరిధి వెంకటేశ్వరకాలనీకి చెందిన సూరిశెట్టి లావణ్య స్వాతి (38) ఈ ప్రమాదంలో మృతిచెందారు. లావణ్యస్వాతికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త సూరిశెట్టి సతీష్ సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీధిలో అందరితో ఎంతో సరదాగా, ఆప్యాయతగా ఉండిన లావణ్యస్వాతి మృతి చెందిందని తెలియడంతో కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి. లావణ్య స్వాతి కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పరామర్శించి ఓదార్చారు.

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం రామాలయం ప్రాంతానికి చెందిన జి.రజని (47) ఈ ప్రమాదంలో మృతి చెందారు. రజని భర్త జి.లక్ష్మణరెడ్డి (51) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆమెకు జి.హర్షవర్ధన్ (21) కుమారుడు ఉన్నాడు. మృతురాలు రజని, ఆమె భర్త కుమారుడితో కలిసి తిరుమల వెళ్లినట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు.

భర్త, పిల్లలతో లావణ్యస్వాతి (ఫైల్‌ఫొటో)

నర్సీపట్నం టౌన్ : అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మున్సిపాలిటీ పెద్దబొడ్డేపల్లికి చెందిన బొడ్డేటి నాయుడుబాబు (55) ఈ ప్రమాదంలో మృతిచెందారు. ఆయన ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తిరుమల తిరుపతి వెంకన్న స్వామి దర్శనార్థం ఏటా వెళుతుంటాడని ఈ ఏడాది ఇలా జరిగిందని రోధిస్తున్నారు. నాయుడుబాబు బీరువాల షాపులో పనిచేస్తున్నాడు. నాయుడుబాబుకు భార్య, కుమార్తె ఉన్నారు. వైకుంఠ ద్వారం దర్శనం నిమిత్తం చెట్టుపల్లి గ్రామానికి చెందిన అతని స్నేహితుడు, భార్య మణికుమారితో కలిసి వెళ్లారు. నాయుడుబాబు మృతిచెందిన విషయాన్ని మణికుమారి ఫోన్‌లో చెప్పడంతో ఆయన ఇంటి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి.

అంగన్వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం డివిజన్‌లోని 5 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాలలో అదనంగా మంజూరైన 39 అంగన్వాడీ ఆయా పోస్టులకు కమిటీ ద్వారా బుధవారం ఉదయం 10 నుండి రాత్రి 10 గంటల వరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ చాంబర్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ రాజవొమ్మంగి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 2 ఆయా పోస్టులకు ఆరుగురు, అడ్డతీగల పరిధిలో 16 ఆయా పోస్టులకు 39 మంది, గంగవరం పరిధిలో 2 ఆయా పోస్టులకు ఆరుగురు, రంపచోడవరం పరిధిలో 2 ఆయా పోస్టులకు ఐదుగురు, మారేడుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 17 ఆయా పోస్టులకు 17 మంది, మొత్తం 39 ఆయా పోస్టులకు 75 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. వారిలో 73 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యకుమారి, రంపచోడవరం ఏడీఎంహెచ్‌ఓ జి.శిరీష, ఐసిడిఎస్ సిడిపిఓలు సంధ్యారాణి, లక్ష్మీ ప్రసన్న, దేవమణి తదితర ఎంపిక కమిటీ ద్వారా పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం పరిశీలించి జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం ఎంపికైన వారికి త్వరలో సంబంధిత గ్రామాల అంగన్వాడీ కేంద్రాలలో ఆయాలుగా నియమించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ తెలిపారు.

గిరిజన గ్రామాల్లో 'గీతం' వైద్యశిబిరాలు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి చిక్కాల

ప్రజాశక్తి -మధురవాడ: కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) సహకారంతో అనకాపల్లి జిల్లాలోని వి.మాడుగుల, చీడికాడ, అల్లూరి జిల్లా జి.మాడుగుల, పాడేరు మండలాలలో గురువారం వైద్యశిబిరాలను నిర్వహించినట్లు గీతం ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ డాక్టర్ స్వాతి చిక్కాల తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కమ్యూనిటి రెజిలెన్స్ రిసోర్స్ సెంటర్ (సిఆర్‌ఆర్‌సి) ఆధ్వర్యంలో ఎంపిక చేసిన నాలుగు మండలాలల్లోని గిరిజన గ్రామాలలో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం, స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన వాతావరణం పట్ల అవగాహన కలిగించడంతో పాటు ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్యసేవలను అందిస్తున్నట్లు తెలిపారు. గీతంతో పాటు అరోహన్ ట్రైబల్ సొసైటి, కృషి విజ్ఞాన కేంద్ర, రోటరీ విశాఖ పెరల్ సిటి సంయుక్తంగా జిమ్‌సర్ ఆసుపత్రి వైద్యులతో కలసి వైద్యశిబిరాలను నిర్వహించి ఉచిత మందులు అందజేశామన్నారు. అలాగే స్థానిక గిరిజనులకు తాగు నీటిని శుభ్ర పరుచుకునే విధానం, స్థానికంగా లభించే ఉత్పత్తులతో ఉపాధిని పెంచుకొనే పద్ధతులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు సోకకుండా రక్షించుకొనే పద్ధతులను వివరించినట్లు తెలిపారు.

నవజాత శిశువుకు మెరుగైన వైద్యం

పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి

ప్రజాశక్తి-కూనవరం : ఒక కేజీ బరువుతో పుట్టి అనారోగ్య సమస్యలు ఉన్న నవజాతి శిశువుకు కూనవరం మండలం కోతులగుట్ట నవజాతి శిశుకేంద్రంలో వైద్యులు సుమారు 45 రోజుల పాటు మెరుగైన వైద్య సేవలు అందించారు. ఆ శిశువు పూర్తిగా కోలుకోవడంతో గురువారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు వెల్లడించారు. కూనవరం మండలం నరసింగపేట గ్రామానికి చెందిన బొగ్గా ఆంజిత్, అనిత దంపతులకు 2024 నవంబర్ 16న చింతూరు ఏరియా ఆసుపత్రిలో ఆడ బిడ్డ పుట్టింది. ఆ బిడ్డ పుట్టినప్పుడు కేవలం 1కేజీ బరువు మాత్రమే ఉండడమే, కాకుండా అనారోగ్య సమస్యలు ఉన్నాయి. రోజులు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్యం ఇంకా క్షీణిస్తుండడంతో తల్లిదండ్రులు కూనవరం మండలం కోతులగుట్ట నవజాతి శిశుకేంద్రానికి తీసు కొచ్చారు. ఎస్ఎన్‌సియు పిల్లల వైద్యులు డాక్టర్ ప్రజ్వల ఆ బిడ్డను పరీక్షించి నవంబర్ 26న నవజాతి శిశు కేంద్రంలో అడ్మిట్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్ బాబు నేతృత్వంలో డాక్టర్ ప్రజ్వల, ఎస్ఎన్‌సియు సిబ్బంది సుమారు 45 రోజుల పాటు వైద్య సేవలు అందించారు. దీంతో పుట్టినప్పుడు కేజీ బరువు ఉన్న ఆ శిశువు 45రోజుల తరువాత 2కేజీలకు పెరగడంతో పాటు పూర్తిగా కోలుకోవడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతో గురువారం ఆ బిడ్డను డిశ్చార్జ్ చేశారు. అతి తక్కువ బరువుతో పుట్టినరోజు బిడ్డకు మెరుగైన వైద్య సేవలు అందించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు చెప్పారు. ఈ బిడ్డకు ప్రతి రోజూ ఎంతో కష్టపడి వైద్య సేవలు అందించిన వైద్యులు, సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌సియు సిబ్బంది కె.ఇందు, సాయమ్మ, దుర్గ, మౌనిక, శ్రీవల్లి, డీఈవో సత్యపావని, భద్రకేళి తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న శిశువును డిశ్చార్జి చేస్తున్న వైద్యులు

సమస్యలు పరిష్కరించకుంటే ప్రజాందోళన

తాగునీరు, రోడ్లు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని ములకనపల్లి సచివాలయ పరిధిలో తాగునీరు, రహదారులు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. సిపిఎం ములకనపల్లి జోన్ కమిటీ సమావేశం కుందులూరు గ్రామంలో రవ్వ బుచ్చయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ కుందులూరులో మంచినీటి సమస్య పరిష్కరించాలన్నారు. కుందులూరు నుండి టేకులూరు వరకు బీటీ రోడ్డు, జల్లివారి గూడెం నుండి కుందులూరు ఆర్ అండ్ బి రోడ్డు జంక్షన్ వరకు బీటీ రోడ్డు, మడివి గుంపు పీసం గుంపు మధ్యలో కల్వర్టు, పీసంగుంపు వాగుపై కల్వర్టు, బంగారు గూడెం, జల్లివారి గూడెం మధ్య వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు సత్యనారాయణ, జల్లి సత్యనారాయణ, శాఖ కార్యదర్శులు మోసం సత్యనారాయణ, తెల్లం కన్నా రావు, సోయం భద్రయ్య, కారం రమేష్, బంగారు ప్రసాద్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని

నేడు షిప్‌యార్డు పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి- ములగాడ : హిందుస్థాన్ షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరుతూ ఈనెల 10న శుక్రవారం ధర్నా నిర్వహించనున్నట్లు పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. హిందుస్థాన్ షిప్‌యార్డులో 35 నుంచి 40ఏళ్లపాటు విధులను నిర్వర్తించి,ఉద్యోగ విరమణ తర్వాత అతి తక్కువ పెన్షన్‌తో దుర్భర జీవితం గడుపుతున్న పెన్షనర్లకు రావాల్సిన బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులకు కోట్లు ఖర్చు చేస్తున్న షిప్‌యార్డు యాజమాన్యం, విశ్రాంత ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ చెల్లించడానికి నిరాకరించడ దుర్మార్గమన్నారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్ పర్సన్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్లమో కోర్సులో

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -విశాఖపట్నం : స్థానిక ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ కేంద్రంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఏడాది డిప్లొమా కోర్సులో శిక్షణకు ప్రవేశ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట ఎఐఐఎల్ఎస్‌జి రీజనల్ డైరెక్టర్ బీరేంద్రసింగ్ ఫర్తియాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రజారోగ్య విభాగానికి సంబంధించి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, శానిటరీ విభాగానికి సంబంధించిన ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులని, ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి-కూనవరం :మండలంలోని కరకగూడెం పంచాయితీ కార్యదర్శి రవికుమార్ ప్రవర్తన సరిగా లేదని, ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ సచివాలయ సిబ్బంది గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం మే నెల నుండి నెట్‌వర్క్ పనిచేయడం లేదని, అయినా అలాగే పని చేస్తున్నామని తెలిపారు. ఈ సమస్య గురించి ఎన్నిసార్లు చెప్పిన వినిపించుకోవడం లేదన్నారు. సిబ్బంది జీతాలు, బిల్లులు, ఇంక్రిమెంట్లు చేయకుండా ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులతో అగౌరవంగా, అసభ్య పదజాలం ఉపయోగిస్తూ మాట్లాడుతున్నారని ఆరోపించారు. తక్షణమే పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకోకపోతే ఐటిడిఎ పిఒ, కలెక్టర్‌కు పిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒగా విజయ బాధ్యతల స్వీకరణ

ఎంపిడిఒగా విజయ బాధ్యతలు

ప్రజాశక్త- అడ్డతీగల: అడ్డతీగల మండల అభివృద్ధి అధికారిగా కెఆర్.విజయ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కూనవరంలో ఎంపీడీవోగా పని చేస్తున్న విజయ అడ్డతీగల ఎంపీడీవో (ఎఫ్ఎసి)గా బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో రాజవొమ్మంగి ఎంపీడీవోగా పని చేశారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రధానంగా మండల పరిషత్ కార్యాలయంలోని మరుగుదొడ్లు లేవని, వాటిని వెంటనే రిపేర్ చేయిస్తామని తెలిపార. ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది అభినందనలు

సోకులుగూడెంలో రెవెన్యూ సదస్సు

సోకులు గూడెం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలో వేములకొండ పంచాయతీ సోకులు గూడెం గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఆధార్‌లో మార్పులు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో కారం సురేష్ బాబు, సర్పంచ్ కొమరం పండు దొర, ఎంపీటీసీ నర్రి పాపారావు, పాలకవర్గ సభ్యులు కడబాల రామారావు, వాలాల లక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షులు నేరం వీరస్వామి, ఆర్ఐ, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.